# అన్వేషి

సాయంత్రం, ఆరు బయట కొబ్బరిచెట్టు కింద, మడత మంచం మీద వెల్లకిలా పడుకుని, ఆకాశంలో దూది పింజల్లా తేలుతున్న మేఘాల కేసి చూస్తూ భార్య చెబుతున్నది పరధ్యానంగా వింటున్న రామచంద్రానికి ఉన్నట్టుండి కళ్ళు తిరుగుతున్నట్టనిపించింది. అతని చుట్టూ కొబ్బరిచెట్లూ, మేఘాలు, నక్షత్రాలు - అన్నీ గిరగిర తిరగసాగాయి. అలా గిరగిర తిరుగుతున్న మేఘ శకలాలు పోగుపడి - భూమి మీద ఒక కాలు ఆన్చి ఆకాశమంతా తనే అయి, తాండవ నృత్యం చేస్తున్న ఈశ్వరుడి రూపు దాల్చాయి. ఆ ఈశ్వరుడి శిరస్సున చంద్రవంక వెలుగుతోంది. అదే సమయంలో చెవులు చిల్లులు పడేట్లు ఢమరుక నాదం వినిపించసాగింది.....

రామచంద్రానికి తను కల కంటున్నాడో, నిజంగా చూస్తున్నాడో అర్థం కాలేదు. అతను భయంతో ఒక్కసారి కళ్ళు గట్టిగా మూసుకున్నాడు. క్షణం తరువాత కళ్ళు తెరిచేటప్పటికి దృశ్యం కరిగిపోతోంది. ఢమరుక నాదం ఆగిపోయి, ఎక్కడో నూతిలోనుంచి వస్తున్నట్టు శకుంతల మాటలు వినిపించసాగాయి -

'...... శారద కాలేజీ చదువు పూర్తి కాగానే ఈ సంవత్సరం పెళ్ళి చేసేద్దామంటున్నాడు మా అన్నయ్య. తొందరగా శుభ కార్యం జరిపిస్తే మంచిది. ...'

రామచంద్రానికి కణతల్లో విపరీతంగా నొప్పి అనిపించింది. కళ్ళల్లో సూదులుచ్చుకు పొడుస్తున్నట్టుగా ఉంది. మెల్లిగా శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుని, 'శకుంతలా..... నువ్వు ......ఇప్పుడు....ఏమైనా చూశావా?' అని అడిగాడు. అతనికి చాలా అలసటగా ఉండి మాట నీరసంగా వస్తోంది.

'ఏవిటి చూడడం?' అంది అరుగుమీంచి శకుంతల.

'నీకు....నీకు....ఏవీ వినిపించలేదా?'

'చూడడమేమిటి? వినడమేమిటి?' అంటూ తలెత్తి పరిశీలనగా భర్తను చూసింది శకుంతల. అతని మాట చాలా నీరసంగా వస్తోందని అప్పుడు గ్రహించి, 'ఏమిటి? ఏమైంది?' అనడుగుతూ, ఆందోళనతో అరుగు దిగి వచ్చింది.

'ఏమీలేదు' - రామచంద్రం మంచం మీంచి లేవబోయి, కూలబడ్డాడు.

'ఏమిటలా ఉన్నారు? ఒంట్లో బాగాలేదా ?' - శకుంతల ఈ సారి నిజంగానే కంగారు పడింది. మరింత దగ్గరకొచ్చి అతన్ని పరిశీలనగా చూసింది. అతని మొహం పీక్కుపోయినట్లుంది. కనుపాపలు నిశ్చలంగా ఒక చోట ఉండక కదులుతున్నాయి.

'ఏమీ లేదు. కొంచెం తలనొప్పిగా ఉంది' అన్నాడు రామచంద్రం కణతలు నొక్కు కుంటూ. శకుంతల అమృతాంజనం తీసుకొచ్చి రాసి, 'కొంచెం కాఫీ తాగండి. నీరసం తగ్గుతుంది,' అంటూ ఫ్లాస్కులోంచి కాఫీ కప్పులో పోసి అతనికి అందించింది. కాఫీ తీసుకున్నాక, 'పదండి - డాక్టరు దగ్గరకు వెళదాం' అంది.

'వద్దు - ఇప్పుడు బాగానే ఉందిలే' అన్నాడు రామచంద్రం.

మర్నాటికి అతను మామూలుగా అయ్యాడు. నిన్నటి అనారోగ్య చిహ్నాలు ఏమీ అతని మొహంలో కనిపించకపోయేసరికి శకుంతల కూడా డాక్టరు దగ్గరకు వెడదామని పట్టుబట్టలేదు. వారంరోజుల తర్వాత ఆ సంగతి పూర్తిగా మరిచిపోయింది.

రామచంద్రం మాత్రం నిరంతరం ఆ సంఘటన గురించి ఆలోచించసాగాడు. 'నేను కమ్యూనిష్టుని - ఎప్పుడూ చెయ్యెత్తి దేవుడికి నమస్కరించలేదు. ఇలా ఎందుకు జరిగింది? ఇది భ్రమా లేక ....' - అతను నెల రోజులు తనలో తనే మథన పడి ఓ ఆదివారం సాయంత్రం వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్ళాడు. అతను వెళ్ళేటప్పటికి వెంకటేశ్వర్లు ఒక్కడూ వరండాలో పడక కుర్చీలో పడుకుని కూనిరాగాలు తీస్తున్నాడు. రామచంద్రాన్ని చూసి, 'రా...రా... బహుకాల దర్శనం.... బాగున్నావా? ' అన్నాడు ఆహ్వానిస్తూ.

'ఏమిటి? ఒక్కడివీ కూర్చున్నావు. మీ ఆవిడ, పిల్లలూ లేరా?'

'టీవీ చూస్తున్నారు'

'అలా కాలవ ఒడ్డుకి షికారు వెడదామా?'

'పద' - వెంకటేశ్వర్లు జోళ్ళు తొడుక్కొని వెంటనే బయలు దేరాడు.

దారిపొడుగునా రామచంద్రం విషయం ఎలా మొదలు పెట్టాలా అని ఆలోచిస్తూ పరధ్యానంగా అవీ ఇవీ మాట్లాడుతున్నాడు.

'ఏమిటలా ఉన్నావు?'

'నెల రోజుల క్రితం.....' అంటూ జరిగింది వివరంగా చెప్పాడు రామచంద్రం.

'ఒంటికాలి మీద వెయ్యేళ్ళు తపస్సు చేసిన సర్వసంగ పరిత్యాగులకి కూడా లభించని ఈశ్వర దర్శనం పుచ్చలపల్లి సుందరయ్యగారి శిష్యుడికి అయాచితంగా లభించిందన్నమాట' - వెంకటేశ్వర్లు పకపకా నవ్వుతూ అన్నాడు.

'పరిహాసం కాదు - నాకంతా అయోమయంగా ఉంది'

'అలా పడుకుని నీకు తెలియకుండానే కళ్ళు మూసుకుని కలగనుంటావు'

'కల కాదు- మెలకువగానే ఉన్నాను'

'కల కాకపోతే భ్రమ అయివుంటుంది- నీ కళ్లు చూసిన దృశ్యాన్ని నీ మెదడు సరిగా ఇంటర్ ప్రెట్ చెయ్యలేక తికమకపడి ఉంటుంది'

'అలా అయితే ఈశ్వరుడే ఎందుకు కనిపించాలి?'

'అంటే నిజంగా ఈశ్వర దర్శనం అయిందంటావా? వ్యక్తి అనుభవం సామాజిక అనుభవం కానప్పుడు దానిలో నిజానిజాలు నిర్ణయించడం సాధ్యంకాదు. నీకు కనిపించిన ఈశ్వరుడు మీ ఆవిడకి ఎందుకు కనిపించలేదు.... పైరుగాలికి ప్రాణం లేచొస్తోంది.......పిచ్చి పిచ్చి ఆలోచనలు వదలిపెట్టి పద ....' అన్నాడు వెంకటేశ్వర్లు. అతను రామచంద్రం చెప్పేది సీరియస్‌గా తీసుకోలేదు. రామచంద్రం మీద ఆ సంఘటన ప్రభావం ఎంత గాఢంగా ఉన్నదీ ఆరునెలల తరువాత గానీ అతనికి అర్థం కాలేదు.

ఈ ఆరు నెలలలోనూ రామచంద్రం చాలా మారాడు. అతని దృష్టి ఆధ్యాత్మికంగా సాగింది. భగవద్గీత, ఉపనిషత్తులు చదివి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు కాని అవి అతనికి ఓ పట్టాన కొరుకుడు పడలేదు. గురువు ద్వారా మాత్రమే జ్ఞానం లభిస్తుందని ఎవరో సలహా ఇవ్వగా జనకాశ్రమంలో రామానంద స్వామిని సేవించడం మొదలుపెట్టాడు.

'ఏవిటిదంతా? ఎర్రజెండా వదిలేసి కాషాయ జండా పట్టుకున్నావేవిటి కొంపదీసి?' - కొంచెం వేళాకోళంగానూ, కొంచెం సీరియస్‌గానూ అడిగాడు వెంకటేశ్వర్లు.

'నాచేతిలో ఏ జండా లేదు. నా మనసు నిండా సందేహాలు మాత్రం ఉన్నాయి. మానవ జీవితానికి ఏమైనా అర్థం వుందా? ఆత్మ, పరమాత్మ, కర్మ, మోక్షం, - ఇలాంటి వన్నీ నన్ను కలవర పెడుతున్నాయి .... '

'ఆధ్యాత్మికతలో సమాధానం దొరికిందా?'

'దొరికినట్టే అనిపిస్తోంది...కాని సందేహం వదలడం లేదు'

'బావుంది - నేను ఆస్తికత నుంచి నాస్తికత వైపు ప్రయాణిస్తే నువ్వు గతితార్కిక భౌతిక వాదంలోంచి ఈ గందరగోళంలోకి దూకుతున్నావన్నమాట. నువ్వు ప్రశ్నించే స్వభావం ఇంకా వదులుకోలేదు కనుక సందేహాలు వదలడం లేదు....' - వెంకటేశ్వర్లు అన్నాడు - '....నా అనుభవంతో చెబుతున్న మాట విను. ఇదంతా శుష్క వేదాంతం. నమ్మడం, నమ్మకపోవడం నీ ఇష్టం కాని సీరియస్‌గా ఆలోచిస్తే ఇందులో ఏవీ లేదు. నేను చిన్నప్పటినుంచి ఇవన్నీ చదివి, చదివి, తలబద్దలు కొట్టుకుని, చివరకు ఈ సృష్టి రహస్యాల గురించి ఎవరికీ ఏమీ తెలియదని స్పష్టమై, దేవుడంటే అపనమ్మకం కలగసాగింది. ఆ అపనమ్మకమే చివరకు నన్ను నాస్తికుడుగా చేసింది .....'

'నిన్న మొన్నటి దాకా నేనూ, దేవుడూ, దెయ్యం ఏవీ లేవని వాదించినవాడినే. జీవితపు లోతులు అనుభవంలోకి వచ్చినకొలదీ ఈ వాదనలో ఏదో లోపం ఉందేమోననిపిస్తోంది. ....' - రామచంద్రం సమాధానం చెప్పాడు.

'దేవుడంటే నాకు నవ్వొస్తోంది' - వెంకటేశ్వర్లు అన్నాడు - 'పదిమంది ఎదుట

పడి నేనున్నానని చెప్పడానికి సర్వశక్తిమంతుడైన ఈ దేవుడికి సిగ్గా? భయమా? పైగా ఒకళ్ళా? ఇద్దరా? కాలగర్భంలో అడ్రస్ లేకుండా పోయిన మతాలు, దేవుళ్లూ ఎన్ని వందలో? ఈ దేవుడు ఒక పెద్ద ఫ్రాడ్. అజ్ఞానంలో పుట్టాడు, అజ్ఞానంలో పెరుగుతున్నాడు. జ్ఞానోదయం అయిననాడు నశిస్తాడు....'

'ఇంకచాలు, ఆపు! నువ్వేదో మహా జ్ఞానివైనట్టు, మిగిలినవాళ్లు మూర్ఖులైనట్లు మాట్లాడకు' - రామచంద్రం అసహనంగా అన్నాడు.

'నాకేవీ తెలియదనీ, నేను అజ్ఞానిని అనే జ్ఞానం నాకుంది. కాని దేవుడిని ప్రచారం చేస్తున్న వాళ్ళు అజ్ఞానులమనే స్పృహ కూడా లేని అజ్ఞానులు. వాస్తవాలు చేదుగా ఉండి నీకు మింగుడు పడటం లేదు కాని ఈ పాపిష్టి దేవుడి చరిత్ర అంతా ఒకసారి తిరగేసి చూడు.....' - వెంకటేశ్వర్లు అన్నాడు - '.... చరిత్ర తిరగబడి, కొలంబస్ అమెరికా చేరకుండా, అమెరికా రెడ్ ఇండియన్లే మన 'అనాగరిక' ప్రపంచం మీద దిగి, రక్తపుటేరులు పారిస్తూ మన మతాల్ని నామరూపాలు లేకుండా చేసేసి, వాళ్ళ మతం మనమీద రుద్దితే ఈనాడు మనం 'ఈశ్వరా, అల్లా, జీసస్' అని ప్రార్థించేవాళ్ళం కాదు. అవి దేవదానవ యుద్ధాలుగా కీర్తించి, ఇప్పుడు పేరేనా తెలియని వాళ్ళ దేవుళ్ళని ఇంత ఆవేశంతోనూ ఆరాధించేవాళ్ళం. వాళ్ళ పవిత్ర గ్రంథాల్ని వేదాల్లా పూజించేవాళ్ళం. కత్తి, తుపాకీ లేకుండా దేవుడెక్కడైనా నిలబడగలిగాడా? '

రామచంద్రం ఆలోచిస్తూ ఉండిపోయాడు - 'నేను ఊహిస్తున్న దేవుడు ఈ దేవుడు కాదేమో! ఈ చరాచర ప్రపంచాన్నంతా నడిపించే నామ రూప రహితమైన మహాశక్తి ఏదో ఉండి ఉంటుంది. ఆ శక్తినే ఆస్తికులు వివిధ రూపాలలో ఆరాధిస్తున్నారు కాబోలు...'

'వెర్రి కుదిరింది, రోకలి తలకు చుట్టమన్నాడట, నీలాంటివాడే వెనకటికి! ఈ దేవుడి దివాలాకోరుతనం స్పష్టమవగానే నిరాకార నిర్గుణ బ్రహ్మాను రంగంలోకి దించుతున్నావన్నమాట....' - వెంకటేశ్వర్లు నవ్వాడు - '.... ఈ సృష్టి ఎలా మొదలైందో, ఎలా అంతమవుతుందో తెలియదు కానీ, ఆద్యంతాల మధ్య వికాసం మాత్రం ఏ దివ్య శక్తీ అవసరం లేకుండా స్వయంచలితంగా ఉన్నట్టు కనిపిస్తుంది.... ఇది ఇవాళ తేలే విషయం కాదుకానీ ..... పద.... చీకటి పడుతోంది,' అంటూ వెంకటేశ్వర్లు వెనక్కు తిరగబోతుండగా ఎర్ర మోటారుసైకిలు ఒకటి విసురుగా అతన్ని దూసుకుంటూ వెళ్ళి కొంచెం దూరంలో ఆగింది.

'గుడ్ ఈవినింగ్ అంకుల్,' అంటూ వెంకటేశ్వర్లును పలకరించాడు సుధాకర్.

'నువ్వటరా నాయనా - హడలి చచ్చాను' - వెంకటేశ్వర్లు నవ్వుతూ అని, 'బండి కొంచెం మెల్లిగా నడుపు - నెత్తి మీద హెల్మెట్ పెట్టుకుంటే స్టైయిలు తగ్గిపోతుందా? హెల్మెట్ పెట్టుకో' అని సుధాకర్‌ని మందలించాడు.

'మావయ్య వచ్చాడు - అమ్మ నిన్ను అర్జంటుగా రమ్మంటోంది' అన్నాడు సుధాకర్ తండ్రితో.

'పెళ్ళి విషయం మాట్లాడ్డానికి వచ్చినట్టున్నాడు మీ బావమరిది - నువ్వు

మోటారు సైకిలు మీద వెళ్ళిపో. నేనుమెల్లిగా నడిచి వెడతాలే.....' అన్నాడు వెంకటేశ్వర్లు.

రామచంద్రం అంత ఆత్రత చూపించలేదు - 'నే వస్తాలే - నువ్వెళ్ళు,' అన్నాడు కొడుకుతో.

'వస్తా అంకుల్.... బై బై డాడీ,' అంటూ మోటారు సైకిలు కిక్కిచ్చి బాణంలా దూసుకుపోయాడు సుధాకర్.

'కుర్రాడు జోరు మీదున్నాడు. కాలు నేల మీద నిలవడం లేదు. త్వరగా ముహూర్తం పెట్టించు.'

'చూద్దాంలే'

'ఇంకా చూద్దావేవిటి? ఎంతకాలం తిప్పించుకుంటావ్ మీ బావమరిదిని నీచుట్టూ ? మగపెళ్లి వారి టెక్కు చూపిస్తున్నావేవిటి? ఇంక ఆలస్యం చేయకు...'

దూరంగా సుధాకర్ మోటారుసైకిలు చీకటిలో కలిసిపోతోంది. దాని వెనకనున్న ఎర్ర దీపం అస్పష్టంగా కనిపిస్తోంది. రామచంద్రం అటువైపే చూస్తూ ' తొందరపడితే ఏదీ జరగదు. తొందరపడనంత మాత్రాన ఏదీ ఆగిపోదు. జరగాల్సింది జరగాల్సినప్పుడు జరగాల్సిన విధంగా జరుగుతుంది......' అన్నాడు.

వెంకటేశ్వర్లుకు తెలుసున్నంతవరకూ రామచంద్రానికి అతని బావమరిదికి మధ్య ఏ గొడవలూ లేవు. మరి రామచంద్రం పెళ్ళి ఎందుకు వాయిదా వేస్తూ పోతున్నాడో అతనికి అర్థంకాలేదు. ఏదో అనబోయి, మళ్ళీ వాళ్ళ కుటుంబ వ్యవహారాల్లో తను తల దూర్చడం బాగుండదనిపించి ఆగిపోయాడు వెంకటేశ్వర్లు.

వారం రోజులు తిరగకుండా రామచంద్రం దగ్గర నుంచి అర్థరాత్రి వేళ ఫోను వచ్చింది. రామచంద్రం ఫోనులో చెబుతున్నది వెంకటేశ్వర్లు నమ్మలేకపోయాడు. వెంటనే స్కూటరేసుకుని రామచంద్రం ఇంటికి వెళ్ళాడు. ఇల్లంతా ఏడుపులతో ప్రతిధ్వనిస్తోంది.

'ఏమైంది రామం?' - రామచంద్రాన్ని కౌగిలించుకుని ఏడుస్తూ అడిగాడు వెంకటేశ్వర్లు.

సుధాకర్ పొరుగూరులో ఉన్న మేనమామ ఇంటికి వెళ్ళాడుట. మధ్యాహ్నం వెళ్ళిన వాడు రాత్రి పదిగంటల వరకూ అక్కడే వుండిపోయాడు. 'రాత్రి ఏం వెడతావురా వానలో ..... ఇక్కడే పడుకో....' అన్నాడు మేనమామ. 'వద్దు.... ఇంటి దగ్గర చెప్పలేదు.... నాన్న కోప్పడతాడు...పెద్దవానేం లేదు.....తుంపరేగా పడుతుంట... ఎంత? పది మైళ్ళు, అయిదు నిమిషాల్లో... మళ్ళీ రేపొస్తాగా,' అంటూ కాబోయే పెళ్ళాని కేసి చూస్తూ మోటారు సైకిలెక్కాడు వానలోనే. వంతెన దిగుతూ లారీని ఢీ కొట్టి ఎగిరి పడ్డాడుట. పడడం బురదలో, గడ్డిలో పడ్డా, తలకు బలమైన గాయం తగిలి వెంటనే ప్రాణం పోయింది.

'వాణ్ణి హెల్మెట్ పెట్టుకోరా అని ఎన్నిసార్లు చెప్పినా విన్నాడు కాదు. తలకి అంత గాయం తగలకుండా ఉంటే కాళ్లో, చెయ్యో విరిగేదేమో కాని ప్రాణం పోయేది కాదు' - నాలుగు వారాల తర్వాత రామచంద్రంతో అన్నాడు వెంకటేశ్వర్లు బాధగా.

'ఆయువు మూడిన వాడికి హెల్మెట్ ప్రాణం పోస్తుందా - నీ పిచ్చిగాని' - రామచంద్రం అలమైరా తెరచి, అందులోంచి ఓ ఫైలుతీస్తూ అన్నాడు - 'వీడు పుట్టినప్పుడు, అప్పుడు నాకు నమ్మకం లేకపోయినా, సరదాకి మీ నాన్నగారి చేత జాతకచక్రం వేయించాను. వీడి జాతకంలో లగ్నంలో గురుడు, రాహువు, చంద్రుడు వరసగా సప్తమ అష్టమ భావాలతో ఉన్నారు. వీడు అల్పాయుష్కుడు. ఇలాంటి జాతకులు ఇరవై రెండేళ్ళు దాటి బ్రతికే అవకాశం లేదు. వచ్చే మంగళవారానికి వీడికి ఇరవై రెండు నిండేవి....

వీడు మోటారుసైకిలు కావాలి అని ఎంత గోల చేశాడో తెలుసా? ఎందుకనో నాకు వాడి మరణానికి, మోటారు సైకిల్‌కి సంబంధం ఉందనిపించింది. పోనీ, ఇరవై రెండు నిండాక కొంటానన్నాను. విన్నాడా? నిరాహార దీక్ష చేశాడు. లేక లేక కలిగిన బిడ్డ ఒక చిన్న కోరిక కోరితే నేను పీనాసితనం చూపిస్తున్నానని సతాయించడం మొదలుపెట్టింది శకుంతల. వాడి మేనమామ, అల్లుడికి పెళ్ళిలో ఇద్దామనుకున్న మోటారుసైకిలు ముందే కొనిస్తానన్నాడు. ఎన్ని విధాల ప్రయత్నించినా మోటారు సైకిలు రాకుండా ఆపగలిగానా? వాణ్ణి స్పీడుగా పోవద్దని ఎన్నో సార్లు మందలించాను. వాడి రోజులు దగ్గర పడుతున్నా యని తెలిసి కూడా నేను నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయాను. కాని వాణ్ణి ఆ మార్గం నుంచి తప్పించగలిగానా? మన చేతిలో ఏదో ఉందనుకుంటాం కాని ఏదీలేదు. రాత ఎవరూ తప్పించలేరు' అన్నాడు రామచంద్రం నిర్లిప్తంగా.

'జాతకాలలో నమ్మకం ఎప్పటి నుంచి?' - వెంకటేశ్వర్లు తెల్లబోయి అడిగాడు - '...... మా నాన్న జోస్యం పట్ల నువ్వు నమ్మకం పెంచుకున్నావు కాని మా అమ్మ అకాలమరణం మా నాన్నకు తెలిసిందా? పెళ్ళయిన రెండేళ్ళకే కూతురికి వైధవ్యం రాసి పెట్టి ఉందని మా చెల్లెలి జాతకంలో చూడగలిగాడా? మానాన్నని మించిన జ్యోతిశ్శాస్త్ర పండితుడు మా తాత. మా బాబయ్యది మహారాజ జాతకమనుకున్నాడు కాని పిచ్చెక్కి ఆత్మహత్య చేసుకుంటా డనుకున్నాడా? చివరిరోజుల్లో మా నాన్నకీ జాతకాలలో నమ్మకం పోయినట్లుంది. మా బావ పోయిన తర్వాత జాతకాలు చూడటం మానేశారు. ఆ గ్రంథాలన్నీ కట్టకట్టి అటకెక్కించేశాడు. ఏవిటిది నాన్నా? అంటే, 'ముందేం జరుగుతుందో ఆ రాత రాసిన వాడికి తప్ప ఎవరికీ తెలియదు నాయనా 'అనేవాడు. నేను వందల జాతకాలు చూశాను. కాకతాళీయంగా కొన్ని నిజమవుతాయి. కాని ఈ శాస్త్రానికి పునాది లేదు. పిచ్చి నమ్మకాలు పెంచుకోకు.... ' అని మందలించాడు వెంకటేశ్వర్లు.

' సుధపోయాడనీ, ఇంకెప్పుడూ వాడిని చూడలేననీ, ఇప్పటికీ నమ్మలేక పోతున్నాను వెంకటేశం. వాడు ఎక్కడికో వెళ్ళాడనీ తిరిగి వస్తాడనీ అనిపిస్తోంది.

ముందే పెళ్ళి చేస్తే వాడు శారదని కలవడానికి అలా అర్ధరాత్రీ, అపరాత్రీ వెళ్ళే వాడు కాదా? వాడిని అలా తిరగొద్దు అని గట్టిగా కోప్పడకుండా ఉంటే వాడు భయపడి వానలో బయలుదేరకుండా రాత్రికి మేనమామ ఇంట్లో ఉండిపోయేవాడా? ఈ ప్రమాదం తప్పేదా? శకుంతల నిందిస్తున్నట్లు నేను పరోక్షంగా వాడి ..చావుకి...

కారణమయ్యా.... నేమో...అ...ని...పి...స్తోం..ది...' - రామచంద్రం దుఃఖం కట్టలు తెంచుకు పొంగింది. అతను వెక్కి వెక్కి ఏడవసాగాడు.

'జరిగిపోయిన దాన్ని గురించి ఆలోచించకు' వెంకటేశ్వర్లు ఓదారుస్తూ అన్నాడు- 'జీవితం దుఃఖమయం. ఈ దుఃఖసాగరాన్ని ఈదడానికి మనిషికి ఏదో ఒక ఆలంబన, విశ్వాసం కావాలేమోననిపిస్తోంది నాకు. నువ్వు మార్క్సిజాన్ని వదిలేశావు. దేవుడిలో విశ్వాసం పెంచుకోలేకుండా ఉన్నావు. నడిసముద్రంలో, తుఫానులో, చుక్కాని లేని నావలా ఉంది నీ పరిస్థితి. నా మాటలకేం గాని నీ మనసు దేవుడివైపు మొగ్గుతోంది కనుక, పోనీ ఆ దారిలో నీకు మనశ్శాంతి కలుగుతుందేమో చూడు. ముందు నువ్వు ఈ నిస్పృహ నుంచి బయట పడాలి'- సలహా ఇచ్చాడు వెంకటేశ్వర్లు.

'శకుంతలా! నామనసు బాగా లేదు. నాలుగు పుణ్యస్థలాలూ చూసివద్దాం - స్థలం మారినట్టుగానూ ఉంటుంది.' అన్నాడు రామచంద్రం భార్యతో. శకుంతల వస్తానన లేదు, రాననలేదు. కొడుకు పోయినప్పటి నుంచి భర్తతో సరిగా మాట్లాడడం లేదు ఆమె. శకుంతల మౌనం చూసి రామచంద్రం ఒక్కడే బయలు దేరాడు. తిరుపతి వెళ్ళాడు. రమణాశ్రమం వెళ్ళాడు. ఎక్కడా అతని సందేహాలకు సంతృప్తి కరమైన సమాధానాలు దొరకలేదు. పైగా కొత్త సందేహాలు కలుగసాగాయి.....

పుట్టపర్తి నుంచి తిరిగి వస్తూ విజయవాడ బస్సుస్టాండులో బస్సు కోసం ఎదురు చూస్తూ నిలబడ్డ రామచంద్రం ఒకవ్యక్తి తనకేసే చూస్తుండటం గమనించాడు. అతనికి పక్షవాతం వలన కాబోలు కుడిచెయ్యి, కుడికాలు పడిపోయాయి. నోరు కొంచెం వంకర పోయి, కింది పెదవి వదులుగా కదులుతోంది. తలంతా చింపిరి చింపిరిగా రోత కలిగిం చేలా ఉంది. ఎందుకిలా వీడు నాకేసి చూస్తున్నాడు అని చికాగ్గా మరోవేపు తిరిగాడు రామచంద్రం. రెండు నిమిషాల తర్వాత ఇంకా అతను తనకేసి చూస్తున్నాడా అని అనుమానం వచ్చి, తలతిప్పి చూశాడు. అతను చేతికర్ర సహాయంతో కుంటుకుంటూ నాలుగడుగులు ముందుకొచ్చాడు.

రామచంద్రం అతన్ని తప్పించుకోడానికి కదలగానే, అతను '...రే.....రే.....' అంటూ వెంట పడ్డాడు. 'ఫో...ఫో...' - ముష్టివాడనుకుని విదిలించి హోటల్లోకి వెళ్ళబోయాడు రామచంద్రం. అతను వదిలి పెట్టక '...రే....రే....' అంటూ ఏదో చెప్పసాగాడు. అతని మాట అస్పష్టంగా ఉండి రామచంద్రానికి మొదట అర్థం కాలేదు.

'ఒరే ...నువ్వు... రామ... చంద్రం....కదూ,' - ఒక నిమిషం తర్వాత అతను అంటున్నది మెల్లగా బోధపడింది రామచంద్రానికి.

తనను ఆ వ్యక్తి అలా పేరు పెట్టి పిలవడంతో రామచంద్రం ఆశ్చర్యంతో ఆగి పోయాడు.

'...నన్ను గుర్తు పట్టలేదా? నేను ...కృష్ణమూర్తిని ...మనిద్దరం గుండువారి పేటలో ఒకే వీధిలో ఉండేవాళ్ళం...బాడ్మింటన్ ఆడేవాళ్ళం.....' అతను ఆగి, ఆగి, ప్రయాసతో పలుకుతూ, గుర్తు చెయ్యడానికి కష్టపడుతున్నాడు.

కృష్ణమూర్తి - బాడ్మింటన్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్...పచ్చగా దబ్బపండు ఛాయలో, మంచి పెర్సనాలిటీతో ఉండేవాడు... వాణ్ణి 'జింబో' అని సరదాగా పిలుస్తుండే వారు...వాళ్ళు ఆస్తిపరులు ...ఇల్లు, పొలాలు.... ఒక్కడే కొడుకు .. వీడెందుకిలా అయ్యాడు? రామచంద్రం తెల్లబోయాడు.

కృష్ణమూర్తి ఏదో చెప్పబోతుంటే వారించి, 'పద! ముందు కాఫీ తాగుదాం' అంటూ చెయ్యి పట్టుకుని హోటల్లోకి తీసుకెళ్ళి టిఫిను, కాఫీ ఇప్పించాడు. కృష్ణమూర్తీ, తనూ స్కూలు ఎదురుగా చిట్టయ్య కాఫీ హోటల్లో ఇడ్లీలు, పెసరట్లు తింటూ సినిమాల గురించి సరదాగా మాట్లాడుకోవడం గుర్తుకొచ్చి రామచంద్రానికి కళ్ళల్లో నీరు చిమ్మింది.

'ఏవిటిది కృష్ణా ?' అన్నాడు భుజం మీద అనునయంగా చెయ్యివేసి.

'ఖర్మ- బంధువులు, స్నేహితులు... చివరకు పెళ్ళాం పిల్లలు - అంతా మోసం చేసి బికార్ని చేసి వీధిలోకి గెంటేశారు. ఆస్తి నా పేరున ఉంచుకుంటే ఈ రోజు ఇలా దిక్కులేని వాణ్ణయి పోయేవాడిని కాదురా - కానుకో లేకపోయాను - నాశనం చేసేశారు' - కృష్ణమూర్తి ఏడుస్తూ చెబుతున్నాడు - 'అందం, ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం, అన్నీ ఎప్పుడూ అలాగే ఉండిపోతాయనుకున్నాను - అన్నిరోజులూ మనవి కావని తెలుసుకోలేక పోయాను....'

కృష్ణమూర్తిని ఓదార్చి ఓ వంద రూపాయలివ్వబోయాడు రామచంద్రం.

'వద్దురా' - కృష్ణమూర్తి తల అడ్డంగా ఊపాడు - 'ప్రేమతో మాట్లాడావు - అదే చాలు - అంతా తప్పుకు తిరిగే వారే - మనిషితో మాట్లాడ్డానికి మొహం వాచి పోయానురా - నిన్ను చూసినందుకు చాలా సంతోషంగా ఉంది - డబ్బు గురించి అనుకోకు - ఈ వందతో మరో వారం బతకగలనేమో - బతకకపోయినా నష్టం లేదులే - వద్దురా'

ఆర్నెల్ల తర్వాత కృష్ణమూర్తి రోడ్డు పక్కన దిక్కులేని చావు చచ్చినట్లు, మునిసిపాలిటీ వాళ్ళూ, పోలీసులూ, శవదహనం చేసినట్టు తెలిసి రామచంద్రం మనసు వికలమై పోయింది. ఏవిటీ జీవితం? ఎక్కడ మొదలై అనూహ్యంగా మలుపులు తిరుగుతూ, ఎలా అంతమవుతోంది? ఏవిటీ దు:ఖం? అతను మళ్ళీ తీవ్రమైన అశాంతికి గురయ్యాడు...

'శకుంతలా! నేను కాశీ, ప్రయాగ వెడదామనుకుంటున్నాను - వస్తావా?' - ఆమె రాదని తెలిసినా మాటవరసకి అడిగాడు. అతను ఊహించినట్లుగానే ఆమె రానంది.

రామచంద్రం కాశీ, ప్రయాగ చూశాడు. హరిద్వార్, హృషీకేశ్, కేదార్‌నాథ్, బదరీ నాథ్ - అన్నీతిరిగాడు. ఎక్కడా అతను కోరుకున్న మనశ్శాంతి లభించలేదు. వైష్ణవిదేవి దర్శనం చేసుకుందామని జమ్మూ వెడుతూ, జ్వాలా దేవి గురించి విని, దారిలో పఠాన్ కోటలో బండి దిగిపోయాడు. అటువైపు వెళ్ళే బండి మర్నాడు ఉదయం గానీ లేదని తెలిసి, ఏం చేయాలా అని ఆలోచిస్తూ స్టేషన్ బయటికి వచ్చాడు.

'చంబా.. చంబా... చంబా...జానేవాలి బస్ జా రహీహై...' - బస్సు రాడ్ పట్టుకుని ఊగుతూ అరుస్తున్నాడు కండక్టరు. రామచంద్రం ఆ కుర్రాడికేసి ఒక

క్షణం చూసి బస్సు ఎక్కాడు.

అతని ఎదురు సీటులో కొత్త దంపతులు వచ్చి కూర్చున్నారు. ఆ అమ్మాయికి పదిహేను, పదహారు కంటే ఎక్కువ ఉండదు. పచ్చగా, బంగారంలా మెరిసిపోతోంది. ఆమె ముక్కుకి హిమాచల్ ప్రదేశ్ స్త్రీలు ధరించే 'నత్ని' వేళాడుతోంది. ఆమె తలపై ముసుగు కొంచెం తొలగించి, కళ్ళెత్తి భర్తకేసి మాటి మాటికి చూస్తోంది. ఆ కుర్రాడికి ఇరవై, ఇరవై రెండు కంటే ఎక్కువ వుండదు. ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు తగిలేలా కూర్చున్నారు. 'చిలకా గోరింకల్లా ఉన్నారు' అనుకున్నాడు రామచంద్రం వాళ్ళని చూస్తూ.

పఠాన్‌కోట్ నుంచి బయలుదేరిన బస్సు పంజాబుదాటి హిమాచల్ ప్రదేశ్‌లో ప్రవేశించి, మైదాన ప్రాంతం వదలి ఘాట్‌రోడ్‌లో కొండల పైకెక్కసాగింది. ఆకాశం మేఘావృతమై ఉధృతంగా వాన పడసాగింది. బస్సు పైకి వెళుతున్నకొద్దీ రామచంద్రానికి చలి అనిపించి శాలువా తీసి కప్పుకొని, దూరంగా కనిపిస్తున్న మంచుకొండల్నీ, కింద లోయలో తేలుతున్న మేఘాలనీ చూడసాగాడు. ఎదురుగా కొండని కావలించుకొన్నట్టు నిలిచి పోయిన మేఘంలో బస్సు ప్రవేశించగానే వాన జడి పెద్దదైంది. డ్రైవరు బస్సువేగం తగ్గించి, లైట్లు వేసి దారి చూసుకుంటూ జాగ్రత్తగా నడపసాగాడు. పదినిమిషాల తరువాత మేఘంలోంచి బయట పడిన బస్సు కొంచెం ముందుకు వెళ్ళి ఆగిపోయింది- ఎదురుగా కొండ చరియ విరిగి పడి, రోడ్డంతా మట్టితో, రాళ్ళతో కప్పబడి దారి మూసుకుపోయి ఉంది. అప్పటికి వాన జోరు తగ్గి చిన్నగా చినుకు పడుతోంది.

'పెద్దగా దారి మూసుకు పోలేదు. నలుగురూ చేతులేస్తే సర్కారు వాళ్ళు రోడ్డు బాగు చేసే దాకా ఆగక్కర్లేదు' అన్నాడు డ్రైవరు.

కండక్టరు బస్సు లోంచి పార, గడ్డపార తీసుకుని దిగాడు. అతనితో పాటు ఆడవాళ్ళు, వృద్ధులు తప్ప, అంతా బస్సు దిగారు. గడ్డపార సహాయంతో రాళ్ళని పక్కకి గెంటుతూ దారి చెయ్యసాగారు. అందరితో పాటు రామచంద్రం ఎదురుగా కూర్చున్న కుర్రాడు కూడా దిగబోతుంటే, ఆ అమ్మాయి శాలువా కిందనుంచి, ఎవరికీ కనుపించకుండా అతని చిటికెన వేలు పట్టుకుని 'నువ్వు దిగొద్దు' అన్నట్టు లాగింది. అతను కూర్చుండి పోయాడు. మరో పదినిమిషాలకి బస్సు మెల్లి మెల్లిగా ఖాళీ అయింది. రామచంద్రం, మరో నలుగురైదుగురు తప్ప బస్సులో ఎవరూ లేరు. అందరూ దిగిపోగానే ఆ అమ్మాయి అతనికి మరింత దగ్గరకు జరిగి, ముసుగు పైకెత్తి, మిల మిల మెరిసే కళ్లతో అతనికేసే చూస్తూ అతని చెవిలో గుసగుసలాడసాగింది.

కొత్త దంపతులిద్దరికి మధ్య తను అడ్డంగా ఉన్నాననిపించి రామచంద్రం లేచాడు.

'బాబా! బాహర్ ఠండ్ హై.... బస్ మత్ ఉతరీయే... ' అన్నాడు ఆ కుర్రాడు, రామచంద్రం ఎందుకు లేచాడో అర్థమై, మొహమాటపడుతూ.

'ఫరవానై..... అభీ తక్...మై... బైఠా...' - రామచంద్రం తనకొచ్చిన హిందీలో ఆ కుర్రాడికి సమాధానం చెప్పి బస్సు దిగాడు. బయటకు అడుగు పెట్టగానే చలిగాలి

అతని మొహం మీద విసురుగా కొట్టింది. అతను ఊపిరి తిరగక ఉక్కిరి బిక్కిరైపోయాడు కొంచెం సేపు. కోలుకున్న తర్వాత శాలువా దగ్గరకు లాక్కుని ముందుకు నడిచాడు.

మరో పావుగంటకి రోడ్డు మీద ఉన్న పెద్ద రాళ్ళన్నీ తొలగించడం పూర్తయింది. డ్రైవరు, కండక్టరు మట్టిని పారతో ఓ పక్కకు లాగి దారి చేస్తున్నారు. కొందరు పైనుంచి పడుతున్న నీటి ధారలలో కాళ్ళూ చేతులూ కడుక్కుంటున్నారు.

తనకంటే వయసులో పెద్దలు అలా చలిలో పని చేస్తుంటే తను పెళ్ళాం పక్కన వెచ్చగా కబుర్లు చెబుతూ కూర్చోడం సిగ్గనిపించింది కాబోలు కొత్త పెళ్ళి కొడుక్కి - అతనూ బస్సు దిగాడు. అతను బస్సు దిగగానే అంతా అతని కేసే చూశారు. 'జవానీ....' అంటూ ఎవరో ఏదో అన్నారు. మగాళ్ళంతా గొల్లున నవ్వారు. ఆడవాళ్ళు మొహాలు పక్కకి తిప్పుకుని ముసి ముసి నవ్వులు నవ్వారు. తనను చూసి అంతా పరిహాసంగా నవ్వుతున్నారని అర్థమై, ఆ కుర్రాడి మొహం సిగ్గుతో ఎర్రగా కందిపోయింది. ఏం చెయ్యాలో తోచనట్లు ఓ క్షణం నిలబడిపోయాడు. ముందుకు వెళ్ళాలా, తిరిగి బస్సెక్కాలా అని ఆలోచిస్తున్న అతనికి రామచంద్రం కనుపించాడు. అతను రామచంద్రాన్ని సమీపించి, 'బాబా....' అని పలకరించబోతుండగా, రామచంద్రం తలెత్తి పైకి చూసి 'అయ్యో....' అని పెద్దగా అరుస్తూ ఆ కుర్రాడిని పక్కకు గెంటబోయాడు.

కొండ చరియ విరిగినప్పుడు, ఇంకా వదులుగా అంటి పెట్టుకుని ఉన్న చిన్న రాయి ఒకటి నీటి ప్రవాహానికి మెల్లిగా మట్టి కొట్టుకు పోగా, విడివడి కిందికి వేగంగా జారడం మొదలు పెట్టింది. టెన్నిస్ బాలు పరిమాణంలో ఉన్న ఆ రాయి పడే శబ్దం కూడా ఎవరికీ వినిపించలేదు. యాదాలాపంగా తలపైకెత్తిన రామచంద్రం అది చూసి ఆ కుర్రాడిని పక్కకు గెంటే లోపల, ఆ రాయి పెద్ద బండమీద పడి, ఎగిరి రామచంద్రం పక్కన నిలబడ్డ కుర్రాడి తలను తాకి, కింది అగాధంలోకి దొర్లుకుంటూ వెళ్ళి అదృశ్యమైంది. ఆ కుర్రాడు ఒక కుదుపు కుదిపినట్టయి, తూలి, రోడ్డు మీద వెల్లకిలా పడిపోయాడు.

అంతా క్షణంలో అనూహ్యంగా అలా జరగడంతో నిశ్చేష్టుడైన రామచంద్రం కోలుకుని, ఆందోళనగా ఆ కుర్రాడి లేత మొహం కేసి చూస్తూ చెయ్యి పట్టుకున్నాడు. నుదుటి మీద ఎడమవైపు రాయి తగిలిన చోట కమిలి పోయినట్లు మచ్చ కనిపిస్తోంది, కాని చుక్క రక్తం కూడా రాలేదు. రామచంద్రం నిట్టూర్చి చల్లబడ్డ చెయ్యి వదిలేశాడు.

ఇద్దరు స్త్రీలు కళ్ళు ఒత్తుకుంటూ ఆ అమ్మాయిని బస్సు దింపారు. బస్సు దిగి, అంతా తనకేసి జాలిగా చూస్తుంటే ఆ అమ్మాయి కంగారుపడి, ముసుగు కొంచెం మీదకి లాక్కుని, బెదురు కళ్ళతో భర్తకోసం వెతకసాగింది. ఆమె దగ్గరకు రాగానే గుంపు పక్కకు తొలగింది.·గుంపు మధ్యగా రోడ్డు మీద పడున్న అతన్ని చూడగానే ఆ అమ్మాయి ఏవీ అర్థం కానట్లు ఓ క్షణం శిలలా నిలిచిపోయింది. తర్వాత కెవ్వున కేకవేసి అతని మీద పడి గొల్లు గొల్లున రోదించసాగింది. నలుగురు ఆడవాళ్ళు ఆమె పక్కన కూలబడి, గుండెలు బాదుకుని ఏడుస్తూ, ఆ అమ్మాయిని ఓదార్చసాగారు.

రామచంద్రం ఆ దృశ్యం చూడలేక బరువు గుండెలతో తడబడుతూ లేచాడు.

'గువ్వల జంటలో ఓ గువ్వ ఎగిరిపోయింది.....' - అతను రోడ్డు మీద నడుస్తూ ఆలో చించసాగాడు. క్రమంగా ఏడుపు దూరమవుతోంది - '...... అంతా తమాషాగా జరిగి పోయిందే! జమ్మూ వెళ్ళాల్సిన నేను పఠాన్ కోటలో దిగి, జ్వాలాదేవి వెళ్ళకుండా , అనా లోచితంగా చంబా బస్సు ఎందుకు ఎక్కాను? ఈ కుర్రాడు నన్ను పలకరించడానికి ఆ సమయంలో ఎందుకు వచ్చాడు? ఆ రాయి ఆ క్షణాన కాకుండా, కొంచెం ముందూ వెనకా ఎందుకు జారిపడలేదు? ఈ కుర్రాడికి మృత్యువు అలా రాసి పెట్టి ఉందా? అంటే సృష్టిలో చేతనా చేతన వస్తువుల పుట్టుక, ఎదుగుదల, కదలిక, అంతం - అంతా కాలంలో ముందే నిర్ణయమై ఉందా? నిర్ణయించబడిన సంఘటనలు కాలంలో వరుసగా సంభవిస్తున్నాయే కాని మనిషి ప్రమేయం ఏవీ లేదా? కృష్ణ మూర్తిని అందరూ ఘోరంగా వంచించారా లేక ముందే నిర్ణయించబడిన మార్గంలో వాడి జీవితం అలా అంతమైందా? అదే నిజమైతే - ఇంక పాపమేమిటి? పుణ్యమేమిటి? కర్మ చెయ్యడమేమిటి? కర్మ అను భవించడమేమిటి?'

ఘాట్‌రోడ్డు మలుపు తిరిగి పైకెక్కుతున్న చోట లోయవైపు పిట్టగోడలాంటిది ఉంది. రోడ్డు ఎక్కుతున్న రామచంద్రం ఊపిరందక, ఆయాసపడుతూ, అలసటగా దానిమీద కూలబడ్డాడు.

పైన కొండల మీద కురిసిన వాన నీరు, చిన్నచిన్న జలపాతాలుగా గలగల చప్పుడు చేస్తూ కిందకి జారి, రోడ్డు మీదుగా కింద అగాథంలోకి ప్రవహిస్తోంది. తెల్ల మేఘం ఒకటి నీలికొండల మీంచి జలపాతం ఉరికినట్టు లోయలోకి ఉరుకుతోంది. దూరాన మంచుకొండలు ఎండపడి వెండి కొండల్లా తళ తళలాడుతున్నాయి

'ఇన్ని అందాలతో పాటు ఇంత దుఃఖాన్ని కూడా సర్వ శక్తిమంతుడైన భగవంతుడే సృష్టించాడా?' - ప్రకృతి అందాలు తిలకిస్తూ అనుకున్నాడు రామచంద్రం - '..... లేక వెంకటేశ్వర్లు అన్నట్టు, ఏ నిర్ణీత పథకం లేకుండా, పరిణామం చెందుతున్న సృష్టిలో లేని లోతులు, అర్థాలు చూడడానికి ప్రయత్నించి నేను గందరగోళ పడుతున్నానా? నాకేవీ... అర్థం.... కావడం.....లే...దు......'

రామచంద్రం విపరీతమైన నిస్త్రాణతో ఒరిగి పోయాడు. చేతులాన్చి కూర్చుందా మని ప్రయత్నించాడు. కాని చెయ్యి కదల్చలేకపోయాడు. అతని కనురెప్పలు బరువై మూసుకుపోసాగాయి. అంత చలిలోనూ శరీరమంతా చెమటలు క్రమ్మసాగాయి. పాదాల నుంచి చల్లదనం పైకి ఎగబాకుతున్నట్లనిపించి కాళ్ళు ఒకటి, రెండుసార్లు విదిలించాడు. ఒక క్షణం వేడి అందుకున్నట్లనిపించింది. కాని క్రమంగా చల్లదనం శరీరమంతా వ్యాపించసాగింది. కాలం అతి మెల్లిగా కదులుతున్నట్టూ, శరీరమంతా పట్లువిడి గాలిలో తేలిపోతున్నట్లు అనిపించింది అతనికి. మూసిన కన్నుల ముందు తెల్లని వెలుగు మెల్లిగా కదులుతున్నట్టు అనిపించి దాని మీదే దృష్టి కేంద్రీకరించి చూడసాగాడు. ఆ వెలుగు అతి మెల్లిగా, దూరంగా కదలిపోతుంటే చుట్టూరా చీకటి, నిశ్శబ్దం ఆవరించసాగాయి.

'ఇదన్నమాట మృత్యువంటే... ఎంత హాయిగా, తేలిగ్గా ఉంది' అనుకున్నాడు

అతను. మరికొన్నిక్షణాలలో మరణిస్తాడనగా, పూర్తిగా ఆలోచనాశక్తి కోల్పోకముందు, రామచంద్రం మనసులో ఆఖరి ప్రశ్న మెదిలింది - '...దీనితో అంతా ముగిసిపోతుందా లేక.....'

**( ఆంధ్రప్రభ వార పత్రిక - మార్చ్, 12, 1997)**